సంపుటి :02 సంచిక :166 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

# పాదయాత్రతో ప్రజలకు మరింత చేరువ

- 25న సాయంత్రం 4 గంటలకు ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు పాదయాత్ర
- 26న ఉదయం వర్ధన్నపేట ఫిరంగిగడ్డలో శ్రమదాన కార్యక్రమం
- జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికీ నిర్ణయం
- పార్టీ ఉమ్మడి జిల్లా వ్యవహారాల ఇంఛార్జి, మంత్రి లక్ష్మణ్ కుమార్
- జనహిత పాదయాత్రపై ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలతో సమీక్ష
- పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

05



శనివారం 23, ఆగస్టు 2025

# టైగర్ ఘర్!

## పులులకు ఆవాసయోగ్యంగా మన అటవీప్రాంతం

- గతేడాది ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో అలికిడి
- తాజాగా మానుకోట జిల్లా కొత్తగూడలో పులి సంచారం
- పాద ముద్రలను బట్టి తేల్చిచెప్పిన ఫారెస్ట్ సిబ్బంది
- వాటి ఆవాసం శుభ శూచకమంటున్న పర్యావరణవేత్తలు
- టైగర్ జోన్ ఏర్పాటుపై దృష్టిసారించాలని విజ్ఞప్తి

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అటవీ ప్రాంతం పులులను ఆకర్షిస్తున్నది. దీనిలో భాగంగానే గతేడాది డిసెంబర్ లో ఛత్తీస్గఢ్ అటవీ ప్రాంతం నుంచి ములుగు జిల్లాలోకి ప్రవేశించింది. నాడు ఆ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. తాజాగా 20 రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ ప్రాంతంలోకి ఒక పులి వచ్చి పాడి పశువులను చంపింది. ఇదే తరహాలో జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లా పరిధిలోనూ అటవీశాఖ అధికారులు తరచూ పులి పాద ముద్రలను గుర్తిస్తున్నారు. అలాగే అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బంది ఏర్పాటు చేసిన అల్ట్రా రెడ్ కెమెరాల్లోనూ పులి సంచారం దృశ్యాలు కనిపిస్తున్నాయి. పులులు వచ్చి.. ఇదే ప్రాంతంలో ఆవాసం ఏర్పరుచుకుంటే, అక్కడ జీవివైవిధ్యం అంతబాగుంటుందని, పంటలు అంతబాగా పండుతాయని, అక్కడి నేల సస్యశ్యామలమని శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు చెప్తుంటారు. ఆ ప్రాంతానికి శుభశూచకమని పేర్కొంటారు. అందుకు గల కారణాలు తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే..

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

02



జిల్లాల వారీగా అటవీ విస్తీర్ణం (చ.కి.మీలలో)

| జిల్లా | విస్తీర్ణం |
|---|---|
| వరంగల్ | 53 |
| ములుగు | 2,099 |
| మహబూబాబాద్ | 922 |
| భూపాలపల్లి | 1,157 |
| జనగామ | 65 |
| హనుమకొండ | 48 |

# రైతులకు యూరియా కొరత ఉండదు

05

- నెలాఖరులోపు రాష్ట్రానికి 37,877 మెట్రిక్ టన్నుల యూరియా
- అన్నదాతలెవరూ ఆందోళన చెందొద్దు..
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



## యూరియా సరఫరాలో

# కాంగ్రెస్ ఫెయిల్

04

- రైతుల గోస సర్కార్‌కు పట్టదు..
- యూరియా కొరతపై కేంద్రంపై నెపం వేయొద్దు..
- తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలి..
- రాష్ట్రంలో యూరియా కొరతకు చెక్ పెట్టాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు



## ఏసీబీ వలలో

# ఖాకీ చేప

## డోర్నకల్‌లో సీఐ లంచావతారం

- సీజ్ చేసిన వాహనం విడిపించేందుకు రూ.50 వేలు డిమాండ్
- కానిస్టేబుల్ మధ్యవర్తిత్వం
- బాధితుడు తొలి విడత సొమ్ము ఇస్తుండగా పట్టుకున్న ఏసీబీ





05

# కుంకుమేశ్వరస్వామి ఆలయంలో

# మహా చండీయాగం



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ప్రముఖ శ్రీ కుంకుమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస చివరి రోజు మహా చండీయాగం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు సంపత్ శర్మ ఆధ్వర్యంలో, పరకాల తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎంపీటీసీ, 15వ మాజీ కౌన్సిలర్ చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి దంపతులు యాగాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం అనంతరం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన చండీయాగం మధ్యాహ్నం వరకు కొనసాగి, అర్చకుల సమక్షంలో పూర్తయింది. పట్టణ ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



అక్షర దర్బార్, చిట్యాల: చెట్ల ద్వారానే మానవాళికి ప్రాణ వాయువు అందుతుందని, ప్రతి ఒక్కరూ విస్తృతంగా మొక్కలు నాటాలని చిట్యాల ఎంఈఓ కొడపాక రఘుపతి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీరామ్ రఘుపతి ఆధ్వర్యంలో వనమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలోనే కాకుండా గృహాలు, ఖాళీ స్థలాల్లోనూ మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలను కాపాడవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి, నీలిమా రెడ్డి, కల్పన, విజయలక్ష్మి , ఉస్మాన్ అలీ, సాంబారు రామనారాయణ, సుజాత, శ్రీనివాస్, శంకర్, ఫిజికల్ డైరెక్టర్ సూధం సాంబమూర్తి, మౌనిక, బుజ్జమ్మ పాల్గొన్నారు.



అక్షర దర్బార్ Voice of the people

# టైఘుర్!



## - పులులకు ఆవాసయోగ్యంగా మన అటవీప్రాంతం



**ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అటవీ ప్రాంతం పులులను ఆకర్షిస్తున్నది. దీనిలో భాగంగానే గతేడాది డిసెంబర్ లో ఛత్తీస్గఢ్ అటవీ ప్రాంతం నుంచి ములుగు జిల్లాలోకి ప్రవేశించింది. నాడు ఆ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. తాజాగా 20 రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ ప్రాంతంలోకి ఒక పులి వచ్చి పాడి పశువులను చంపింది. ఇదే తరహాలో జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ జిల్లా పరిధిలోనూ అటవీశాఖ అధికారులు తరచూ పులి పాద ముద్రలను గుర్తిస్తున్నారు. అలాగే అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బంది ఏర్పాటు చేసిన అల్ట్రా రెడ్ కెమెరాల్లోనూ పులి సంచారం దృశ్యాలు కనిపిస్తున్నాయి. పులులు వచ్చి.. ఇదే ప్రాంతంలో ఆవాసం ఏర్పరుచుకుంటే, అక్కడ జీవివైవిధ్యం అంతబాగుంటుందని, పంటలు అంతబాగా పండుతాయని, అక్కడి నేల సస్యశ్యామలమని శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు చెప్తుంటారు. ఆ ప్రాంతానికి శుభశూచకమని పేర్కొంటారు. అందుకు గల కారణాలు తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే..**

- గతేడాది ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో అలికిడి
- తాజాగా మానుకోట జిల్లా కొత్తగూడలో పులి సంచారం
- పాద ముద్రలను బట్టి తేల్చిచెప్పిన ఫారెస్ట్ సిబ్బంది
- వాటి ఆవాసం శుభశూచకమంటున్న పర్యావరణవేత్తలు
- టైగర్ జోన్ ఏర్పాటుపై దృష్టిసారించాలని విజ్ఞప్తి

**అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి :**

ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం, మంగపేటతో పాటు భూపాలపల్లి జిల్లాలోని అటవీప్రాంతంలోకి 2020, 2021లో అనేక సార్లు పులుల సంచారం కనిపించింది. ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతానికి గతేడాది డిసెంబర్, 20 రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ ప్రాంతంలోకి తాజాగా ఒక పులి వచ్చింది. అటవీశాఖ అధికారులు పులి పాదముద్రలు సైతం నిర్ధారించారు. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం.. ఒక పులి తన ఆహారం కోసం వేటాడటానికి, తన ఆవాసం ఏర్పరుచుకోవడానికి ఉండటానికి దట్టమైన అటవీ ప్రాంతం చాలా అవసరం. ఒకరోజుకు పులి సుమారు 20 చదరపు కిలోమీటర్ల 60 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతంలో సంచరిస్తుంది. ఆ ప్రాంతంలో పొడవైన చెట్లు, దట్టమైన పొదలు, గడ్డి భూములు ఉండాలి. అలాగే పులి దాహం తీర్చు కునేం దుకు ఆ ప్రాంతంలో నీటి జాడ ఉండాలి. నది లేదా వాగు లేదా సరస్సు తప్పనిసరిగా ఉండాలి. వేసవి లోనూ నీటి వనరు అందుబాటులో ఉండాలి. పులి ప్రధానంగా శాకాహారం తినే పెద్ద జంతువులను వేటాడి తింటుంది. అందుకే, ఆ అడవిలో జింకలు, అడవి పందులు, దున్నలు వంటివి ఉండాలి.

**- జీవవైవిధ్యానికి ప్రతీక..**

ఒక పులి ఒక అటవీ ప్రాంతంలో ఆవాసం ఏర్పరచుకుందంటే, ఆ ప్రాంతంలో అన్ని రకాల జంతువులు ఉన్నట్లు లెక్క. అంటే జింకలు, అడవి పందులు, కుందేళ్లు, కోతులు, ఉడతలు, అడవి పిల్లలు.. ఇలా అన్ని రకాల వన్యప్రాణులు ఉన్నట్లే. అక్కడ ప్రకృతిలోని ఆహార గొలుసు సమంగా ఉన్నట్లు. అయితే.. పై ఆహార గొలుసు పరిధిలోని జంతువులు ఉంటే చిరుతపులి, ఎలుగుబంటి వంటి ఇతర మాంసాహారులకు కూడా అక్కడ ఆవాసం ఉన్నట్లు. ఇంత పెద్ద ప్రాంతం ఉండడం వల్లనే పులి తన ఆహారాన్ని సులభంగా వేటాడి, తన మనుగడను కొనసాగించగలుగుతుంది.అందుకే పులి ఉండటం అటవీ ప్రాంతానికి ఎంతో ముఖ్యం. జీవవైవిధ్యం సరిగ్గా ఉంటే, ఆ ప్రాంతంలో కరువు కటకాలు ఉండవని అనేక శాస్త్రీయ అధ్యయనాలు అంతర్జాతీయంగా ప్రయోగపూర్వకంగా వెల్లడించాయి.

**- అటవీశాఖ దృష్టిసారించాలి..**

టైగర్ జోన్ ఏర్పాటుకు అటవీశాఖ కృషి చేయాలని ఉమ్మడి జిల్లావాసులు కోరుతున్నారు. అలాగే అటవీ ప్రాంతంలో మరిన్ని గడ్డిమైదానాలు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగైతే.. ఆ ప్రాంతంలో శాకాహార జంతువుల మనుగడ పెరుగుతుందని, తద్వారా పులులు ఎక్కువగా ఆ ప్రాంతానికి వస్తాయంటున్నారు. మరోవైపు ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్టు 2023 ప్రకారం.. ఉమ్మడి జిల్లాలో అటవీ ప్రాంతం గతంలో కంటే తగ్గిందని పేర్కొంది. అందుకు కారణం అటవీప్రాంతంలో పోడు పెరగడమేనని ఆ రిపోర్టు తేల్చిచెప్పింది. కాబట్టి.. అటవీ విస్తీర్ణం తగ్గకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### 2018లో తెరపైకి టైగర్ జోన్..

**ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని వందల ఎకరాల అటవీ విస్తీర్ణం పులుల ఆవాసానికి అనుకూలమని పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు, అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. గతంలో ఆ ప్రాంతంలో అనేకసార్లు పులి సంచరించడమే అందుకు కారణం. ఈ నేపథ్యంలో 2018లో 800 చ.కి.మీ విస్తీర్ణంలో టైగర్ జోన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ టైగర్ జోన్ ఏటూరునాగారం, పెద్దపల్లి, మంచిర్యాల, మహదేవుపూర్ ను కలుపుతూ ఉంటుందని తెలిసింది. అయితే.. ఆ ప్రతిపాదన అక్కడితోనే ఆగిపోవడం శోచనీయం.**

### జిల్లాల వారీగా అటవీ విస్తీర్ణం (చ.కి.మీలలో)

| | |
|---|---|
| ములుగు | - 2,099 |
| మహబూబాబాద్ | - 922 |
| భూపాలపల్లి | - 1,157 |
| జనగామ | - 65 |
| హనుమకొండ | - 48 |
| వరంగల్ | - 53 |



### - వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు..

**వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. ఎవరైనా వన్యప్రాణులను వేటాడినా, చంపినా కఠిన చర్యలు ఉంటాయి. వేటాడుతూ పట్టిబడిన నిందితులకు నాన్బెయిలబుల్ శిక్షలు ఉంటాయి. అటవీ జంతవులను వేటాడే వారిని పోలీసులు వారెంట్ లేకుండానే అరెస్టు చేసే చట్టాలున్నాయి. ఆటపట్టించినా, వాటిని భయపెట్టినా వారిపై కేసులు ఉంటాయి. న్యాయస్థానం వారికి ఆరు నెలల వరకు జైలు శిక్ష విధిస్తుంది.**

# 'మధ్యాహ్న' కార్మికులకు చీరల పంపిణీ..




అక్షర దర్బార్, పరకాల: హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ హనుమకొండ జిల్లా నడికూడ మండల కేంద్రంలోని  జిల్లా పరిషత్ పాఠశాలలలో పనిచేస్తున్న 41 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు చీరెలను ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ మండల అభివృద్ధి అధికారి గజ్జెల విమల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు పి.జయ, ఉపాధ్యాయ బృందం, వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# అంతిమ యాత్రలో పాల్గొన్న డాక్టర్ పెసరు



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వంగల  నరసింహా రెడ్డి (కండక్టర్) ప్రమాదవశాత్తు మరణించగా, వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, అంతిమయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పెసరు విజయచందర్ రెడ్డి. కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి, మండల కార్యదర్శి పి. మల్లారెడ్డి, మండల కోశాధికారి ఎదునూరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



## పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడితే
# కఠిన చర్యలు
**–ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్**



విద్యార్థి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో కలుషిత నీరు తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, "పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, విద్యార్థులతో ముకాముఖి జరిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ టీచర్ రాజేందర్ నీటి ట్యాంకులో పురుగుల మందు కలిపారని, చూసిన వారిని బెదిరించారని వెల్లడించారు. ఈ ఘటనపై కలెక్టర్ రాహుల్ శర్మ ఉపాధ్యాయుడు రాజేందర్, వేణు, సూర్యప్రకాశ్, వంట మనిషి రాజేశ్వరి లను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఉద్యోగం నుండి తొలగించి, క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్ చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే పరామర్శించి, 24 గంటల వైద్య పర్యవేక్షణ ఉండాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ టెక్నోస్కూల్ లో ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

అక్షర దర్బార్, నర్సంపేట: లక్నేపల్లిలోని బాలాజీ టెక్నోస్కూల్‌లో శనివారం 2వ జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి. రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు."ఆర్యభట్ట నుంచి గగన్‌యాన్ వరకు అంతరిక్షరంగంలో భారత్ తిరుగులేని విజయాలను సాధించింది. చంద్రయాన్–3 విజయంతో భారత్ ప్రపంచానికి తన సామర్థ్యాన్ని చాటింది. 2035 నాటికి స్వంత స్పేస్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది" అని ఆయన గుర్తు చేశారు. చంద్రయాన్–3 తో భారత్ ఆగస్టు 23, 2023న చంద్రుని దక్షిణ ధ్రువాన్ని చేరుకున్న ప్రథమ దేశంగా నిలిచిందని, అందుకే ఆగస్టు 23ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "జాతీయ అంతరిక్ష దినోత్సవం"గా ప్రకటించారని పేర్కొన్నారు. విద్యార్థులు సైన్స్‌ను కేవలం కెరీర్‌గా కాకుండా అనంత అవకాశాల పయనంగా చూడాలని సూచించారు. ఎన్‌సిసి 10వ బెటాలియన్ ఆధ్వర్యంలో థర్డ్ ఆఫీసర్ ఎం.డి. రియాజుద్దీన్ స్ఫూర్తిదాయకంగా కార్యక్రమాన్ని ముందుకు నడిపారు. విద్యార్థులు రూపొందించిన అంతరిక్ష చార్టులు, క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కె.రమేష్, విజయ్, గౌతమ్, పూర్ణిమ, రాజ్‌కుమార్, రమ్య, కృష్ణవేణి, హేమలత, నరసింహారెడ్డి, అనిత, విశాల తదితరులు పాల్గొన్నారు.







# స్థానిక సమస్యలపై డీటీకి వినతిపత్రం

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై మండల డిప్యూటీ తహసిల్దార్ జి. ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి మాట్లాడుతూ, శాయంపేట–ఆత్మకూరు ప్రధాన రహదారి వద్ద కాలువలు తొలగించి కొత్త రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోవడం వల్ల వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే భూభారతి చట్టం అమల్లోకి వచ్చినా, గ్రామాల్లో భూ సమస్యలు ఇంకా పరిష్కరించలేదని వాపోయారు. గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుందని, వాటిని జంతు సంరక్షణశాలకు తరలించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా ఉపాధ్యక్షురాలు కోడేపాక స్వరూప, ప్రధాన కార్యదర్శి తాటికొండ రవికిరణ్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, సీనియర్ నాయకులు బూర ఈశ్వరయ్య, బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

## గొల్ల కురుమలను అక్రమ అరెస్టులు చేసి
# ఉద్యమాన్ని ఆపలేరు
**–గొర్రె అనిల్ యాదవ్**




అక్షర దర్బార్, చిట్యాల : గొల్ల కురుమల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఉద్యమాన్ని అక్రమ అరెస్టులు చేసి అణచలేరని, ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని గొల్ల కురుమల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె అనిల్ యాదవ్ అన్నారు. భూపాలపల్లి జేడీ కార్యాలయం ముట్టడిని అడ్డుకోవడానికి తెల్లవారు జామునచే పోలీసుల చేత అరెస్టులు జరిపారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్లు, మేకలకు నట్టల మందులు పంపిణీ చేయాలని, జీవోల ప్రకారం ప్రభుత్వ భూములను మేత కోసం సంఘాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో చనిపోయే కాపరులకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, గొర్లు, మేకలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. రెండో విడత గొర్లు లేదా నగదు బదిలీ తక్షణం చేయాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మర్రి నరేష్ యాదవ్, సంఘం అధ్యక్షుడు కోడారి రవి, యువజన అధ్యక్షుడు వేముల హరీష్ యాదవ్, జిల్లా నాయకులు కట్టే కొల్ల రాజు, కోశాధికారి యదండ్ల మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో చేరిన మాజీ సర్పంచ్



అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ బయ్య రాజేందర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు చింతి రెడ్డి మధుసుదన్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ దూమాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీకి చల్లా పరామర్శ..



అక్షర దర్బార్ సంగెం: మండలం ఎలుగూరు రంగంపేట గ్రామ బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఎంపీటీసీ జనగాం శ్రీనివాస్ కి కంటి ఆపరేషన్ జరగగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి  హాస్పిటల్ వెళ్లి వారిని పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మాజీ ఎమ్మెల్యే కోరారు.మాజీ ఎమ్మెల్యే  వెంట పరామర్శించిన వారిలో మండల బిఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి

**- మొగుళ్లపల్లి ఎస్సై బి. అశోక్**

.అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: వినాయక చవితి పండుగను నిర్వహించుకొనుట గాను నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పక పాటించాలని మొగుళ్ళపల్లి ఎస్సై బోరగల అశోక్ తెలిపారు. శనివారం మొగుళ్లపల్లి మండలంలోని వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాలలో వినాయక మండపాలను నెలకొల్పేవారు ముందస్తుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ వారి వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, దానిలో మండపం నెలకొల్పే ప్రదేశం, తేదీ, ప్రతిమ ఎత్తు తదితర వివరాలను పేర్కొనాలని కోరారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత పోలీస్ స్టేషన్ లో అనుమతి జారీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజా భద్రతకు భంగం కలిగించకుండా నియమ నిబంధనలు పాటించాలని మండపం నెలకొల్పే దగ్గర సంబంధిత విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని, మండపం వద్ద నిర్వాహకుల పేర్లు , కూడిన ఫ్లెక్సీలను, ఫోన్ నెంబర్లను నమోదు  చేయాలన్నారు. మండపం వద్ద 24 గంటల పాటు ఒకరు అందుబాటులో ఉండాలని తెలిపారు. శబ్ద కాలుష్య నివారణ గాను, వృద్ధులకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తక్కువ శబ్దం వచ్చే స్పీకర్లను వినియోగించుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైకులను ఆఫ్ చేసుకోవాలని, మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలను చేయరాదని ఏమైనా ఇబ్బందికర సమస్యలు ఏర్పడినట్లయితే 100కు డయల్ చేయవలెనని  ఎస్ఐ  పేర్కొన్నారు.




మాట్లాడుతున్న ఎస్సై బి. అశోక్






# పోటీతత్వం కాదు

- **భక్తి భావంతో ఉత్సవాలు జరుపుకోవాలి**
- **గణేష్ ఉత్సవాలపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: గణేష్ ఉత్సవాలు పోటీతత్వంతో కాకుండా భక్తి భావంతో నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లా కలెక్టర్లు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్, మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.సీపీ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ గణేష్ మండపాలకు విద్యుత్ శాఖ నుండి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, మండళ్ల నిర్వాహకులు పోలీస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలోని 12 నిమజ్జన ప్రదేశాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కూడా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరగాలని చర్యలు చేపడతామని తెలిపారు. జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కూడా తమ పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో 27 నిమజ్జన ప్రదేశాల ఏర్పాట్లకు రూ.18 లక్షలు కేటాయించామని తెలిపారు. గణేష్ నిమజ్జనం, మిలాద్–ఉన్–నబి ఒకే రోజున జరగబోవడం వల్ల మతసామరస్యాన్ని కాపాడేలా పోలీస్, మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు కృషి చేయాలని సీపీ సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో

# ఎమ్మెల్యే గండ్ర విఫలం

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి**

అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన గండ్ర సత్యనారాయణ రావు రెండు సంవత్సరాలుగా ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి ఆరోపించారు. శనివారం మొగుళ్ళపల్లి మండలంలో బిజెపి మండల అధ్యక్షులు మోరె వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ – రహదారులు, ఆరోగ్య సదుపాయాలు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, సిబ్బంది లేమి వంటి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల తరచుగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రారెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్ రెడ్డి, పర్లపెల్లి ఎంపిటిసి దొంగల రాజయ్య, మాజీ జెడ్పిటిసి కుమ్మరి సారయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కిరణ్, దళిత మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు బండా రవీందర్, జిల్లా నాయకులు పోతుగంటి సాయిలు, వేముల రాజయ్య, పులి వెంకట్ రెడ్డి, గూడూరు మహిపాల్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ పెండ్లి మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్, అరికంతపు కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బల్గురు కిషన్ రావు, రాస బిక్షపతి, చిలుకమారి రాజేంద్ర ప్రసాద్, పులి భాస్కర్ రెడ్డి, వైకుంఠ రెడ్డి, బండారి తిరుపతి, కూస రత్నాకర్, మొగుళ్ళపల్లి బూత్ అధ్యక్షులు బోయిని కుమార్, రేపాల శ్రీనివాస్, వెన్నంపల్లి శ్రీనివాస్, మధుకర్, ఊరుకొండ ఓదేలు పాల్గొన్నారు.



# యూరియా సరఫరాలో ప్రభుత్వం ఫెయిల్

**–మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు**



అక్షరదర్బార్, హైదరాబాద్:రాష్ట్ర రైతుల యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల సమస్యలను కూడా రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.రైతులు ఎరువుల కొరతతో రోడ్డెక్కే పరిస్థితి కాంగ్రెస్ పాలనలోనే వచ్చిందని ఆయన ఆరోపించారు. “మద్యం ఏరులై పారుతుంటే... ఎరువులు మాత్రం అందుబాటులో లేవు” అని ఎద్దేవా చేశారు. ఆడపిల్లల పెండ్లిళ్లకు బంగారం ఇస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు “యూరియానే బంగారంగా మార్చేశారు” అని విమర్శించారు.రైతులు కుండపోత వానలో క్యూలైన్లలో నిలబడి, ఆధార్ కార్డులు, పాస్‌బుక్కులు చూపించి ఎరువుల కోసం పడుతున్న కష్టాలను గుర్తు చేశారు. “యూరియా బస్తాల కోసం అధికారులు కాళ్లు పట్టుకోవడం, పోలీసులు లాఠీలతో కొట్టడం వాస్తవాలు కావా?” అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని, తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు యూరియా కొరత రాలేదని హరీశ్ రావు పేర్కొన్నారు.

# పారిశుధ్యంపై నిర్లక్ష్యం తగదు

**–సీపీఐ మండల నాయకులు మంద భాస్కర్**

అక్షర దర్బార్, కేసముద్రం: పారిశుధ్యం విషయంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఐ మండల నాయకులు మంద భాస్కర్ విమర్శించారు. శనివారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినా, మున్సిపాలిటీ విలీన గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఒక నెల క్రితం సిపిఐ ఆధ్వర్యంలో మెమోరాండం ఇచ్చినా అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధిలైట్లు లేక రాత్రివేళలు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ఫాగింగ్ చేపట్టడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసి, మురికి కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రదీప్ రావును సన్మానించిన

# విజయచందర్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల: వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావును కలసి శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ ,కాగితాల సాయికుమార్, బత్తుల సుమంత్, తదితరులు పాల్గొన్నారు.



# దాతల సహకారాన్ని ఉపయోగించుకోవాలి

**–పరికిపండ్ల వేణు**

అక్షర దర్బార్, దుగ్గొండి : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తౌసండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు పరికిపండ్ల వేణు సూచించారు. శనివారం మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులను ఎన్ఆర్ఐ దాత శానబోయిన రాజ్‌కుమార్ సౌజన్యంతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన అతిథిగా హాజరైన పరికిపండ్ల వేణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి గ్రామస్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారికే ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయని, నిబద్ధత గల ఉపాధ్యాయులు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నారని ఆయన అభినందించారు. పేద విద్యార్థుల కోసం దాతలు మరింత సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ శానబోయిన రాజ్‌కుమార్, జోనల్ చైర్మన్ చొప్పరి సోమయ్య, మాజీ సర్పంచ్ పెండ్యాల మమతా రాజు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఓరుగంటి కవిత తిరుపతి, హెడ్‌మాస్టర్ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



# ఏసీబీ వలలో ఖాకీ చేప

- డోర్నకల్ లో సీఐ లంచావతారం
- సీజ్ చేసిన వాహనం విడిపించేందుకు రూ.50 వేలు డిమాండ్
- కానిస్టేబుల్ మధ్యవర్తిత్వం
- బాధితుడు తొలి విడత సొమ్ము ఇస్తుండగా పట్టుకున్న ఏసీబీ

అక్షరదర్బార్, డోర్నకల్: వాహన తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాన్ని విడిపించేందుకు డోర్నకల్ పోలీస్ సీఐ భూక్యా రాజేశ్ వాహనదారుడి నుంచి రూ.50 వేల లంచం డిమాండ్ చేశాడు. కానిస్టేబుల్ మధ్యవర్తి. కానిస్టేబుల్ ధరావత్ రవిని పురమాయించి, వాహనదారుడి నుంచి రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ సర్కిల్ సీఐ భూక్యా రాజేష్ ఇటీవల మండలంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో సరైన వాహన పత్రాల్లేని వాహనం పట్టుబడింది. పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలి ◌ంచారు. ఆ వాహనాన్ని విడిపించుకునేందుకు వాహనదారుడు పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. రూ.50 వేలు లంచం ఇస్తేనే , వాహనం విడిచి పెడతానని సీఐ బేరమాడాడు. తొలి విడతలో రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో వాహనదారుడు ఏసీబీని ఆశ్రయించాడు. శనివారం వాహనదారుడు మొదటి విడతగా సీఐకి రూ. 30 వేల లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. సహకరించిన కానిస్టేబుల్ రవిని కూడా అదుపులోకి తీసుకున్నారు. లంచం తీసుకున్న డబ్బులను సీఐ నుంచి రికవరీ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వరంగల్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల స్పెషల్ జడ్జి ముందు హాజరు పరిచారు. ఏసీబీ అధికారులు సీఐ రాజేష్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.1.20 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన సంచలనం కలిగించింది.







## పాదయాత్రతో ప్రజలకు
# మరింత చేరువ

- 25న సాయంత్రం 4 గంటలకు ఇల్లంద నుంచి వర్ధన్నపేట వరకు పాదయాత్ర
- 26న ఉదయం వర్ధన్నపేట ఫిరంగిగడ్డలో శ్రమదాన కార్యక్రమం
- జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికీ నిర్ణయం
- పార్టీ ఉమ్మడి జిల్లా వ్యవహారాల ఇంఛార్జి, మంత్రి లక్ష్మణ్ కుమార్
- జనహిత పాదయాత్రపై ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలతో సమీక్ష
- పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అక్షరదర్బార్, హనుమకొండ : ప్రజలకు మరింత చేరువ కావడానికి జనహిత పాదయాత్ర దోహదపడగలదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జనహిత పాదయాత్ర ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు ఆయన చెప్పారు. ఈనెల 25, 26న వర్ధన్నపేట నియోజకవర్గంలో జనహిత పాదయాత్ర నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యే ఈ జనహిత పాదయాత్రపై శనివారం హనుమకొండలోని డీసీసీ భవన్ లో సమీక్ష సమావేశం జరిగింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా వ్యవహారాల ఇన్చార్జి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, వరంగల్, మహబూబాబాద్ ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పాలకుర్తి, రామగుండం ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, ఠాకూర్ మకాన్ సింగ్, ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, శంకర్ నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, నమిండ్ల శ్రీనివాస్, ధర్మారావు, టుపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ రావు, భూపాలపల్లి, ములుగు జిల్లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డి, పైడాకుల అశోక్, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జీడబ్ల్యూఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నేతృత్వంలో ఈనెల 25, 26న వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్ర జరగనుందని వెల్లడించారు. 25న సాయంత్రం 4 గంటలకు వర్ధన్నపేట మండలం ఇల్లంద మార్కెట్ నుంచి వర్ధన్నపేట టౌన్ లోని అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర జరగనుందని, 26న ఉదయం 6:30 గంటలకు వర్ధన్నపేట టౌన్ లోని ఫిరంగి గడ్డ ప్రభుత్వ పాఠశాలలో శ్రమదాన కార్యక్రమం జరగనుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రకటించారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామిని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దర్శించుకుంటారని, ఉదయం 11:30 గంటలకు వర్ధన్నపేట టౌన్ శివారులోని లక్ష్మి గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశం జరగనుందని మంత్రి తెలిపారు. ఆయా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో పాదయాత్రను విజయవంతం చేయడానికి సన్నద్ధం కావాలని లక్ష్మణ్ కుమార్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గడచిన 20 నెలల్లో దేశంలోనే ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టలేని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టి విజయవంతంగా అమలు చేస్తుందని, సన్నిహిత పాదయాత్ర ద్వారా ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యక్రమాలు, ఆలోచన విధానాలను ప్రజలకు వివరించే దిశగా ముందుకు సాగాలని కాంగ్రెస్ శ్రేణులను ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని చెప్పారు. ఇక నుంచి అభివృద్ధితోపాటు పార్టీ బలోపేతం కోసం చురుకుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరు శాతం విజయం సాధించి తీరుతామని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నేతలు ఐక్యతతో జనహిత పాదయాత్రలో పాల్గొనాలని అన్నారు. సమావేశానికి ముందు సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల మౌనం వహించి శ్రద్ధాంజలి ఘటించారు.



## రైతులకు యూరియా
# కొరత ఉండదు

- నెలాఖరులోపు రాష్ట్రానికి 37,877 మెట్రిక్ టన్నుల యూరియా
- అన్నదాతలెవరూ ఆందోళన చెందొద్దు..
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో యూరియా కొరత గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 42 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. శనివారం మరో 6,543 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరుకుంటున్నదని తెలిపారు. ఈ నెల చివరి నాటికి మరో 37,877 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) సీఈఓ అలోక్ సింఘాల్, నాగార్జున ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్‌సీఎల్) తెలంగాణ సేల్స్ మేనేజర్ రాజేష్‌తో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్రానికి రావాల్సిన 62,473 మెట్రిక్ టన్నుల యూరియా కోటా ఇంకా అందలేదని మంత్రి సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సరఫరా ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలపై ప్రతికూల ప్రభావం పడకముందే యూరియాను పంపాలని కోరారు. కనీసం 50శాతం యూరియానైనా ఈ వారంలోనే ఆర్ఎఫ్‌సీఎల్ లేదా ఎన్ఎఫ్‌సీఎల్ నుంచి పంపాలని సూచించారు. రైతులు అసౌకర్యానికి గురికాకుండా ఎరువుల పంపిణీ వెంటనే జరగాలని స్పష్టం చేశారు. దీనికి అలోక్ సింఘాల్ స్పందిస్తూ, రైతుల అవసరాలను తీర్చడానికి యూరియాను త్వరలోనే సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. క్షేత్రస్థాయిలో రైతులు యూరియా కోసం ఇబ్బంది పడకుండా ఉండాలంటే, సరఫరా సంస్థలు సత్వరం యూరియా సప్లై చేయాల్సి ఉంటుందన్నారు.

# ఎస్సీ,ఎస్టీ యాక్ట్ కేసు నమోదు

అక్షర దర్బార్, శాయంపేట: కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు శాయంపేట ఎస్సై జె.పరమేశ్వర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పరకాల మండల కేంద్రానికి చెందిన ఒంటేరు సారయ్య తన వ్యవసాయ భూమిని గత మూడు సంవత్సరాలుగా పెద్దకోడెపాక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సావాసి రమేష్తో దున్నిస్తున్నాడు. అయితే, ప్రతి ఎకరానికి అదనంగా రూ.1000 వసూలు చేస్తున్నాడని తెలుసుకున్న సారయ్య, భూమి దున్నవద్దని రమేష్‌కు తెలిపాడు. తరువాత సారయ్య, కామారెడ్డిపల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ మోరే బీమ్ ద్వారా తన పొలాన్ని దున్నిస్తుండగా, రమేష్ ఫోన్ చేసి బెదిరించడంతో పాటు, బీమ్‌ను దూషించినట్లు తెలిసింది. ఈ విషయం గురించి సారయ్య రమేష్‌ను ప్రశ్నించగా, అతను అందరి ముందు కులం పేరుతో దూషిస్తూ దాడి చేసినట్లు సారయ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో, పోలీసులు రమేష్‌పై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915